క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు



జస్టిస్ తుహిన్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌ను జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు నగరంలోని ఎస్పీ వసతి గృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ తుహిన్ కుమార్ ఉమ్మడి జిల్లా వీరఘట్టం మండలానికి చెందిన వ్యక్తి. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానంలో, బార్ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. ఆయనను కలిసినవారిలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగీ శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు, భవానీ ప్రసాద్, వరప్రసాద్, కొమ్ము రమణమూర్తి, వనజాక్షి, బార్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు ఆగూరు ఉమామహేశ్వరరావు, పీవీ రమణరావు, మామిడి క్రాంతి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఎచ్చెర్ల: మండలంలోని ఫరీదుపేట గ్రామానికి చెందిన పుల్లేటికుర్తి మోహనరావు గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. అయితే వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆయన కుటుంబ సభ్యులకు పైడి వారి కుటుంబం ట్రస్టు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు కలిసి రూ.42,516లను మోహనరావు భార్యకు సోమవారం అందించారు. కార్యక్రమంలో సభ్యులు పైడి చిన్నప్పల నాయుడు, పైడి రాజశేఖర్, పైడి మనోజ్‌కుమార్, పైడి నర్సినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



షాపుల వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రణస్థలం: గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా సోమవారం రణస్థలం మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో కిరాణా షాపుల్లో, మార్కెట్‌లో షాపులను నిశితంగా పరిశీలించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో ఉమారుద్రకోటేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో బలరామ ప్రతిష్ట దేవాలయమైన ఉమారుద్ర కోటేశ్వరస్వామికి శ్రావణమాసం ఆఖరి సోమవారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూజలు జరిపించారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.సూర్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉద్యోగి అన్నాక బదిలీ సర్వసాధారణమని, అంత మాత్రాన కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ పి.సూర్యం అన్నారు. శ్రీకాకుళంలోని కళింగ భవన్‌లో ఆయన సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వ్యక్తిగతంగా ఎవరిని ఉద్దేశించి వీడియో కాల్ చేయలేదని స్పష్టం చేశారు. కూనపై చేస్తున్న ఆరోపణల వల్ల ఆయన కుటుంబ సభ్యులు వేదనకు గురవుతున్నారని అన్నారు. ప్రిన్సిపాల్‌కు కంచిలిలో పనిచేయడం ఇష్టం లేకుంటే మరో చోటకు వెళ్లేలా ప్రయత్నం చేస్తామన్నారు. అంతేకానీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు.

అధికం.. అనర్థం..!



ఎస్‌ఎంపురంలో ఎరువుల పంపిణీ చేపడుతున్న వ్యవసాయ అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

- పరిమితికి మించి ఎరువులు వాడితే ప్రమాదం
- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- అవగాహన కల్పిస్తున్న నిపుణులు

ఎచ్చెర్ల: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న అన్నదాత అధిక దిగుబడులు సాధించేందుకు అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు ఉపయోగించి నష్టాలను కొనితెచ్చుకుంటున్నాడు. వాస్తవానికి మోతాదుకు మించి ఎరువులు వాడితే నష్టమే తప్ప ప్రయోజనమేమీ ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయంలో ఎరువులు వినియోగంపై అన్నదాతలు అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని చెబుతున్నారు. ఒక పద్ధతి ప్రకారం ఎరువులు వినియోగిస్తే మంచి పంట దిగుబడితో పాటు భూసారం కూడా పెంచుకోవచ్చని సలహా ఇస్తున్నారు. సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. ఇదే ప్రధాన ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తుండడం విశేషం. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎచ్చెర్ల మండలంలో 6 వేల ఎకరాల్లో వరిపంటను, 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 11 వందల ఎకరాల్లో ప్రత్తి పంటను సాగు చేస్తున్నారు.

భూసారం దెబ్బ తింటుంది

సాధారణంగా పంటకు నత్రజని, భాస్వరం, పోటాష్ ఎరువులను నాలుగు లేదా రెండు సార్లు వేర్వేరుగా వాడుతారు. కానీ చాలా మంది రైతులు నత్రజని 8 నుంచి 12 సార్లు వేర్వేరుగా వాడుతున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతింటోంది. వరి నాట్లు సమయంలో 50 కిలోల డీఏపీకి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాస్ కలపాలి. నాట్లు వేసిన 30 రోజుల తర్వాత రెండో విడత కింద ఎకరానికి 25 కిలోల యూరియాను వాడాలి. లేకుంటే పావు లీటరు నానో యూరియాను పిచికారీ చేయాలి. పంటవేసిన 45 రోజుల తర్వాత, మరోసారి 25 కిలోల యూరియాతో 15 కిలోల పొటాష్‌ను కలిపి వాడాలి. లేదంటే అర లీటరు నానో యూరియాను వాడవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు రసాయన ఎరువుల వినియోగంతో ప్రయోజనం లేదని చెబుతూ.. ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహిస్తున్నాం. ప్రతీ గ్రామంలోని రైతులతో సమావేశాలను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. ఎరువులు ఎక్కువగా వాడకుండా ఉండేలా అప్రమత్తం చేస్తున్నాం. సాగులో చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నాం.

– వావిలాపల్లి రాజేష్, ఏవో, ఎచ్చెర్ల

సమష్టి కృషితో మురపాక మండలాన్ని సాధిద్దాం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: సమష్టి కృషితో మురపాక మండలం ఏర్పాటు లక్ష్యంగా పని చేయాలని మురపాక మండల సాధన సమితి తీర్మానించింది. మురపాక మండలం ఏర్పాటు లక్ష్యంగా అక్కడి రామ మందిరంలో ఎంఎంఎస్, శ్రీవివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ప్రజలు, నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితేనే మురపాక మండలం ఏర్పాటు సాధ్యమని పేర్కొన్నారు. ఈనెల 29న శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి క్యాబినెట్ సబ్ కమిటీ వచ్చినప్పుడు ప్రజలు, నాయకులు ఏకతాటిపైకి వచ్చి ప్రజల అభిమతాన్ని తెలియజేయాలని సూచించారు. మండలం ఏర్పాటుకి కావాల్సిన అవశ్యకతను వివరించాలని, మండలం ఏర్పాటును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ పంచాయతీల పెద్దలు తేనెల సురేష్ కుమార్, మాడుగుల మురళీధర్ బాబా, బాలి శ్రీనివాస నాయుడు, మలిపెద్ది నారాయణమూర్తి, శశిధర్, మీసాల భానోజీరావు, కొన్ని వెంకటరావు, గొర్లె రాంబాబు, మీసాల అప్పల నాయుడు, రెడ్డి గోపాల్, బార్ల సింహాచలం, కింతలి వెంకటరమణ, ఈశ్వరరావు, రాము, షణ్ముకరావు పాల్గొన్నారు.

ఉచితం పేరుతో ఆర్టీసీ ప్రైవేటుపరం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కొర్ల శిరీష



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళలకు ఉచిత బస్సు పేరుతో ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టేసి, ప్రైవేటుపరం చేయాలనే ఆలోచన సీఎం చంద్రబాబు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కొర్ల శిరీష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటకల్లో ఈ పథకం పెద్దగా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఆర్టీసీలు అప్పుల బారిన పడ్డాయని, సర్వీసులు తగ్గిపోయాయని చివరికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా రాష్ట్రాల్లో విఫలమైన పథకం ఏపీలో ఎలా విజయవంతం అవుతుందని ప్రశ్నించారు. ఆర్టీసీకి ఆదాయం తగ్గిపోతే మొదట తగ్గేది గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులేనని, దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు, కూలీలు, రైతుల ప్రయాణానికి బస్సులు దొరకడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ ఖర్చులు తీరకపోవడంతో బస్సులు తగ్గిపోయి ప్రైవేటు వాహనాల ఆధిపత్యం పెరుగుతుందన్నారు. ఈ భారాలన్నీ ఇంకో రూపంలో ప్రజలపైనే వేస్తారన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న దుంగ శ్రీధర్

శ్రీకాకుళం అర్బన్: జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు దుంగ శ్రీధర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు బుర్రి మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నందమూరి కుటుంబంపై కనీస గౌరవంలేని ఇలాంటి వారిని క్షమించకూడదన్నారు. ఇలాంటి వారిని సీఎం చంద్రబాబు ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదని, వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వెంటనే జూనియర్ ఎన్టీఆర్‌కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్రంలో తిరగనీయమని స్పష్టం చేశారు.

ముమ్మరంగా వరద నీరు తొలగింపు



కాంప్లెక్స్ లోపలికి చేరిన వర్షపు నీరు



కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రధాన కాలువలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెంటనే ఆర్టీసీ కాంప్లెక్స్‌ను స్వయంగా పరిశీలించారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తిచేయాలని, వర్షాకాలంలో డ్రైనేజీలు శుభ్రపరిచే పనులు నిరంతరం కొనసాగించాల్సిందేనని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. మోటార్ల సాయంతో వర్షపునీటిని బయటకు పంపిస్తున్నారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికలను జేసీబీల సాయంతో తొలగించే పనులను మొదలుపెట్టారు. రాత్రికి వరదనీరు కాస్త తగ్గుముఖం పట్టింది. కలెక్టర్ వెంట డీపీటీవో అప్పలనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డిపో మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్‌శర్మ, డీఈఈ రవికుమార్, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

ముంపులో వరి పంటలు



రాగోలు పరిసర ప్రాంతంలో ముంపునకు గురైన వరి పంట



ఎస్ఎస్‌వలసలో ముంపునకు గురైన వరి పంటలు

శ్రీకాకుళం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరి పంటలు ముంపునకు గురయ్యాయి. ఆదివారం, సోమవారం కురిసిన భారీ వర్షాలకు గానూ పంట పొలాలన్నీ చెరువులను తలపించాయి. ప్రధానంగా రాగోలు, ఎస్ఎస్‌వలస, పాత్రునివలస, తండేవలస, గూడేం తదితర ప్రాంతాల్లోని పొలాలు జలమయమయ్యాయి.

– శ్రీకాకుళం రూరల్

రహదారులు జలమయం

జి.సిగడాం: మండలంలో సోమవారం కురిసిన వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై గోతులు ఉండడంతో ప్రయాణికులు ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. కాగా రోడ్ల పక్కనే ఉన్నటువంటి కాలువలను ఆక్రమించడం వలనే పంటపొలాలకు వెళ్లాల్సిన నీరు రహదారులపై నిలిచిపోతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దాలెమ్మరాజు వలస పెట్రోల్ బంకు వద్ద...



చీపురుపల్లి - రాజాం ప్రధాన రహదారిలో దుస్థితి



డీఆర్‌వలస గ్రామ సమీపంలో...

నాగావళి ఉధృతి పరిశీలన

ఎచ్చెర్ల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాగావళి నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష సూచించారు. ఈ మేరకు మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామం వద్ద నాగావళి వరద ఉధృతిని సోమవారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి జాగ్రత్తలు వివరించారు. వీరితో పాటు తహసీల్దార్ బలగ గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



రణస్థలం మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు ఎస్.సత్యవతి, ఎం.మురళీకృష్ణ, ఎ.చిన్నతల్లి, కె.శ్రీహరి, జోగారావు, ఎల్లారావు, శ్రీను, లక్ష్మణరావులను ఘనంగా సత్కరించారు.

– రణస్థలం

మత్స్యకారులు వేటకు వెళ్లవద్దు



మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

గార: అల్పపీడనం కారణంగా ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చేంతవరకూ మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ ఎం.చక్రవర్తి స్పష్టం చేశారు. మండలంలోని బందరువానిపేట తీరంలో మండల ప్రత్యేకాధికారి బాలకృష్ణ, ఎంపీడీవో ఎ.రఘు, ఎస్ఐ సీహెచ్ గంగరాజులతో కలిసి సోమవారం పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. మరో అల్పపీడనం ఏర్పడనున్న దృష్ట్యా అధికారులు ఎప్పటికప్పుడూ సమాచారం తెలియజేస్తారన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కొలిక్కిరాని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్లు



టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్న ఈవో ప్రసాద్ తదితరులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలకు చెందిన ఏజెన్సీల ఎంపికకు గాను నిర్వహించిన టెండర్ ప్రక్రియపై స్పష్టత కరువైంది. ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో రావివలస ఈవో గురునాథరావు పర్యవేక్షణలో సోమవారం జరిగిన టెండర్ ప్రక్రియలో మొత్తం ఆరుగురు పాల్గొనగా.. సర్వీస్ ఛార్జీ జీరో కోట్ చేసిన టెండర్ దారునికి పాట దక్కుతుండడంతో స్థానిక మిగిలిన పాటదారులు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. జీరో ఛార్జీకి టెండర్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత తెలుగు సూర్యనారాయణ, ఆలయ ఈవోకు మధ్య కొంత సమయం వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే నిబంధనల ప్రకారమే ప్రక్రియను పూర్తి చేస్తామని ఆలయ ఈవో ప్రసాద్ ప్రకటించారు. అయినప్పటికీ మిగిలినవారు పలు సందేహాలను వ్యక్తం చేస్తూ ఈవో నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ..!

అవుట్ సోర్సింగ్ టెండర్ ప్రక్రియ అంతా సజావుగా జరుగుతున్న తరుణంలో వచ్చిన బేధాభిప్రాయాల అంశం నేరుగా ఎమ్మెల్యే గొండు శంకర్‌కు చేరింది. దీంతో ఆయన పిలుపు మేరకు ఈవో ప్రసాద్ హుటాహుటిన ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లిపోయారు. నిబంధనల ప్రకారం ఎవరు తక్కువ కోట్ చేస్తే వారికే టెండర్ దక్కించుకునే అర్హత ఉంటుందని ఈవో ప్రసాద్ గట్టిగా చెప్పినట్లుగా సమాచారం. అయితే స్థానిక అభిప్రాయాల కారణంగా తక్కువ కోట్ చేసినవారిలో తొలి వరుసలో ఉన్న ఒకరిద్దరిని సమన్వయం చేసుకుని టెండర్ ఖరారు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా టెండర్‌లో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ జోక్యం చేసుకోవడంతో టెండర్ ప్రక్రియపై సస్పెన్స్ నెలకొంది. అయితే దీనిపై ఆలయ ఈవో ప్రసాద్ మాట్లాడుతూ...కచ్చితంగా నిబంధనలకు అనుసరించే టెండర్ ఖరారు చేస్తామని, ఈమేరకు ఉన్నతాధికారులకు నివేదించనున్నామని, వారి ఆదేశాల మేరకు చర్యలుంటాయన్నారు.

ధర్మాన్ని ఆచరిస్తే మనల్ని కాపాడుతుంది



స్వామి చిద్రూపానంద సరస్వతిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ధర్మాన్ని మనం ఆచరిస్తే, ఆ ధర్మం మనల్ని అన్నివిధాలా కాపాడుతుందని ఢిల్లీ చిన్మయ మిషన్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు స్వామి చిద్రూపానంద సరస్వతి అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో చిన్మయ మిషన్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో మహాభారతంలోని శాంతిపర్వంపై ఉపన్యాసాలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా మహా భారతాన్ని పరిచయం చేశారు. మహా భారత లక్ష్యం కేవలం శాంతి స్థాపనే అని, యుద్ధం కోసం కాదని పేర్కొన్నారు. మనకు తెలియని ఎన్నో విషయాలు భారతం ద్వారా తెలుస్తాయన్నారు. ముందుగా ఎమ్మెల్యే గొండు శంకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. గుజరాతీపేటకు చెందిన ఉమా బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్వామిజీని కమిటీ సభ్యులంతా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో స్వామి పరాత్మానంద సరస్వతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, అంధవరపు ప్రసాద్, నిష్టల నరసింహమూర్తి, కనుగుల దుర్గా శ్రీనివాస్, కోరాడ రమేష్, మల్లా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చంద్రజీవన్

జి.సిగడాం: తుఫాన్ కారణంగా అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి చంద్రజీవన్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. తుఫాన్ కారణంగా గ్రామాల్లో అంటురోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వలన ఎక్కడైనా చెరువులు, వాగుల గట్లు తెగితే తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ మహాదేవు సరిత, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తరేశ్వరునికి భస్మాభిషేకం



ఉత్తరేశ్వరునికి భస్మాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ వద్దనున్న ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు గంధం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో నాగావళి నదికి తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు భస్మంతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన యూనిట్ పరీక్షలు



శ్రీకాకుళంలోని ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అన్ని యాజమాన్య జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు రెండో యూనిట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీల్లో మాత్రం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మరలా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోజుకు రెండు పేపర్లు చొప్పున పరీక్షలను జరిపారు. తొలిరోజు ఉదయం తెలుగు/సంస్కృతం/హిందీ పేపర్లకు, మధ్యాహ్నం ఇంగ్లిష్ పేపర్‌కు పరీక్షలు రాశారు. ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు అందజేసే విధంగా అధికారులు పక్కాగా చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, అనేక జిల్లాల్లో జూనియర్ కాలేజీలకు సైతం సెలవు ప్రకటించడంతో పరీక్ష వాయిదా వేయొచ్చని భావించినప్పటికీ.. యథాతథంగా పరీక్షలను నిర్వహించారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో క్వశ్చన్ పేపర్లను పొందుపర్చింది.

అర్ధరాత్రి హైవేపై ట్రాఫిక్ జామ్



నుజ్జునుజ్జు అయిన లారీ ముందు భాగం

ఎచ్చెర్ల: మండలంలో ఫరీదుపేట సమీపంలోని హైవేపై రాంగ్ రూట్‌లో వస్తున్న ఒక లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదం వలన హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయాలు పాలైన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.